క్లుప్తంగా

భారతీయ కళలపై పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం వెంకటేశ్వరరావు

కె.గంగవరం: మండల కేంద్రమైన కె.గంగవరంలో జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయిని వాడ్రేవు సువర్చల భారతీయ కళలపై రచించిన పుస్తకాన్ని హెచ్‌ఎం వెంకటేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. పుస్తక రచయిత్రి సువర్చల మాట్లాడుతూ ఎనిమిదో తరగతి విద్యార్థులకు భారతీయ కళలపై పాఠం ఉండటంతో, విద్యార్థులకు కళలు, సాహిత్యంపై మరింత అవగాహన కల్పించాలన్న సంకల్పంతో ఈ పుస్తకాన్ని రచించినట్టు వివరించారు. తెలుగు ఉపాధ్యాయులు గోపి ఏడుకొండలు, అమలదాసు ఫణి తనకు రచనా సహకారం అందించారన్నారు. ఉపాధ్యాయులు భీమరాజు, బ్రహ్మానందం, శ్రీనివాసు, రామలక్ష్మి, లక్ష్మి, రాఘవకుమారి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ



శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ

కపిలేశ్వరపురం: తాతపూడిలో రూ.10 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు గురువారం జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీటీసీ జుత్తుగ వెంకటలక్ష్మి భూమిపూజ చేశారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జెడ్పీటీసీ అబ్బు, ఎంపీపీ సత్యవేణిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుత్తుల సురేష్, నాయకులు జుత్తుగ సూరిబాబు, కొప్పిశెట్టి శ్రీనివాస్, సాయిబాబు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేలటూరులో సీసీ రోడ్డు నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న జేఈ

కపిలేశ్వరపురం: నేలటూరు ఎస్సీ ఏరియాలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులను పంచాయతీరాజ్ జేఈ డీవీ రాఘవులు పరిశీలించారు. సర్పంచ్ కుక్కల వీరన్న, ఎంపీటీసీ రుద్రాక్షుల వీరగౌరీ కుమారి మాట్లాడుతూ గ్రామంలో సీసీ రహదారులు, డ్రైన్ల నిర్మాణాలకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. వారి వెంట సచివాలయ ఇంజినీరింగ్ అధికారి నిమ్మకాయల పద్మరాజు, ఉప సర్పంచ్ శనక్కాయల దొరబాబు, కొప్పిశెట్టి కిశోర్, రుద్రాక్షుల శ్రీనివాస్, వార్డు సభ్యులు ఉన్నారు.

తెలుగు యువత అధ్యక్షుడిగా ఓంతేజ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణ తెలుగుయుత అధ్యక్షుడిగా వేగుళ్ళ ఓంతేజ నియమితులయ్యారు. ఆయన గురువారం పార్టీ పట్టణ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును కలిసి తన నియామకంపై కృతజ్ఞతలు తెలిపారు.

వెదురుపాకలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

రాయవరం: వెదురుపాక సచివాలయములో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు నౌడు వెంకటరమణ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యులు, మండల ఉపాధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, సొసైటీ అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

రాయవరం: పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థులు, తమ తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలని రాయవరం మండల విద్యాశాఖాధికారి పి.రామలక్ష్మణమూర్తి సూచించారు. సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని ఆయన నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం రాయి దయామణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఈవో రామలక్ష్మణమూర్తి మాట్లాడుతూ మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. పరీక్షల గడువు సమీపిస్తున్నందున తల్లిదండ్రులు తమ చిన్నారుల చదువు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

రాణాకు రికానా!

- దశాబ్దాల నుంచి పరాయి పంచన గొల్లపాలెం పోలీస్ స్టేషన్
- ఇరుకు గదుల్లో సిబ్బంది అవస్థలు
- స్థల పరిశీలన చేసి, నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్న జిల్లా ఎస్పీ



ఇరుకుగా ఉండే పీహెచ్‌సీ సబ్ సెంటరులో కొనసాగుతున్న గొల్లపాలెం పోలీస్ స్టేషన్

కాజులూరు: గొల్లపాలెం పోలీస్ స్టేషన్‌కు ఎట్టకేలకు సొంతగూడు దొరకనుంది. సొంత భవనం కోసం ఎదురుచూస్తున్న ఈ పోలీస్ స్టేషన్‌కు పది సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించడంతో, దశాబ్దాల సమస్యకు తెరపడనుంది. గొల్లపాలెం పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం లేకపోవటంతో సిబ్బంది, ఫిర్యాదుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణానికి సరైన స్థలం లేకపోవటంతో, అప్పట్లో నిధులు కూడా మురుగుపోయాయి. తాజాగా కాకినాడ-కోటిపల్లి రహదారిని ఆనుకుని పది సెంట్ల భూమిని ప్రభుత్వం కేటాయించడంతో పోలీస్ స్టేషన్ నిర్మాణానికి ఆశలు చిగురిస్తున్నాయి. 1946లో కోరంగి పోలీస్ స్టేషన్ నుంచి 10 గ్రామాలు, రామచంద్రపురం పోలీస్ స్టేషన్ నుంచి 14 గ్రామాలను కలుపుతూ గొల్లపాలెం పోలీస్ స్టేషన్‌ను నెలకొల్పారు. ఆపై మండలాల ఏర్పాటుతో కాజులూరు మండలంలోని 26 గ్రామాలకు గొల్లపాలెం పోలీస్ స్టేషన్ రక్షణ శాఖ కార్యాలయంగా సేవలందిస్తోంది. ప్రారంభం నుంచీ 65 ఏళ్ల పాటు ఒకే ఇంట్లో పోలీస్ స్టేషన్ అద్దెకు కొనసాగింది. 2011లో అది కాస్త భారీ వర్షాలకు కుప్పకూలింది. అప్పటికప్పుడు పోలీస్ స్టేషన్‌ను జర్నలిస్టు కాలనీకి ఆనుకుని ఉన్న పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లోకి మార్చారు. అప్పట్నుంచి పోలీస్ స్టేషన్ అక్కడే కొనసాగుతోంది. పీహెచ్‌సీ సబ్ సెంటర్ మరీ చిన్న భవనం కావటంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్‌కు తీసుకొచ్చే నిందితులను ఉంచేందుకు లాకప్, రికార్డులు భద్రపరిచే గదులు లేకుండా పోయాయి. ఉన్న రెండు గదులనే వివిధ విభాగాలుగా విభజించి, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కనీసం మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో అత్యవసర సమయాల్లో సిబ్బంది ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి. స్టేషన్‌లో ఉన్న ఇద్దరు మహిళా కానిస్టేబుళ్ల ఇబ్బందులు వర్ణనాతీతం. భవనం పల్లపు ప్రాంతంలో ఉండడంతో కొద్దిపాటి వర్షానికే జలమయమవుతుంది. దీంతో పరిసరాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది.



గొల్లపాలెంలో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, సిబ్బంది (ఫైల్)

స్థలం దొరక్క మురిగిన నిధులు

గొల్లపాలెంలో పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం నిర్మాణానికి సరైన స్థల సదుపాయం లభ్యం కాకపోవటంతో గతంలో మంజూరైన నిధులు మురుగుపోయాయి. పంచాయతీ కార్యాలయానికి ఆనుకుని ఉన్న ఎనిమిది సెంట్ల స్థలాన్ని పోలీస్ స్టేషన్‌కు కేటాయిస్తూ గతంలో సర్పంచ్‌లుగా పనిచేసిన పోతురాజు బాబురావు, కొప్పుల సత్యనారాయణ రెండు సార్లు తీర్మానాలు చేయించారు. పోలీసు శాఖ నిబంధనల ప్రకారం భవన నిర్మాణానికి కనీసం పది సెంట్ల భూమి అవసరం. దీంతో ఆ నిధులు మురుగుపోయాయి. ప్రస్తుతం కాకినాడ-కోటిపల్లి రహదారిలో స్టేట్‌బ్యాంక్ పక్కనున్న రెవెన్యూ ఖాళీ స్థలం పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి అనుకూలంగా ఉండటంతో, ఆ స్థలానికి గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ఇచ్చింది. ఇటీవల కొన్ని రోజుల క్రితం స్టేషన్ పర్యవేక్షణకు వచ్చిన కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్.. పీహెచ్‌సీ సబ్ సెంటర్లోని ఇరుకిరుకు గదుల్లో పోలీస్ స్టేషన్ నిర్వహణను చూసి ఆవేదనకు గురయ్యారు. సిబ్బందితో కలసి స్టేట్ బ్యాంక్ పక్కనున్న ప్రతిపాదిత స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి ఉన్నతాధికారులతో చర్చించి, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇక పరిస్థితి చక్కబడుతుంది



గొల్లపాలెంలో పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం లేకపోవడంతో పీహెచ్‌సీ సబ్ సెంటరులో స్టేషన్‌ను కొనసాగిస్తున్నాం. సరైన వసతులు లేక ఇరుకిరుకు గదుల్లోనే విధులు నిర్వహిస్తున్నాం. అనువైన స్థలం కేటాయించడంతో భవన నిర్మాణానికి పరిస్థితులు అనుకూలిస్తాయని భావిస్తున్నాం.

– ఎం.తులసీరామ్, ఎస్సై, గొల్లపాలెం

పోలీస్ స్టేషన్‌లో కూర్చునే జాగా లేదు



గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఇరుకిరుకు గదుల్లో నిర్వహిస్తుండడంతో సిబ్బంది విధులు నిర్వహించేందుకే చోటు లేకుండా ఉంది. స్థానిక సమస్యలపై స్టేషన్‌కు వెళితే, ఫిర్యాదుదారులు కనీసం కుర్చునేందుకు జాగా కూడా లేకుండా పోయింది.

– జొన్నకూటి వెంకటేశ్వరరావు, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు, గొల్లపాలెం

పోలీసు స్టేషన్ తనిఖీ



సోమేశ్వరంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రామకృష్ణ

రాయవరం: రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ గురువారం రాయవరం పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. రామచంద్రపురం డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన తొలిసారిగా రాయవరం పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో కేసుల వివరాలు, ప్రగతిని ఎస్సై జి.నరేష్ డీఎస్పీ రామకృష్ణకు వివరించారు. అనంతరం ఆయన మండలంలోని లొల్ల, సోమేశ్వరం తదితర గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేశారు. సోమేశ్వరంలో ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలింగ్‌బూత్‌లో ఉండాల్సిన మౌలిక వసతులను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ, ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్సై నరేష్‌కు సూచించారు.

జనార్దనస్వామికి పూజలు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం రథంగుడిలో జనార్దనస్వామికి ఆలయ అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ సదపతి జయబాబు, సభ్యుల పర్యవేక్షణలో స్వామికి నిత్యహోమం, బలిహరణ, సదస్యం పూజలు నిర్వహించారు. ఈనెల 25 వరకూ కల్యాణోత్సవాలు కొనసాగుతాయని చైర్మన్ జయబాబు తెలిపారు.

ప్రజా సంక్షేమానికి నిరంతర కృషి

ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్





ఆర్యావటంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న పిల్లి సుభాష్‌చంద్రబోస్ (అంతరచిత్రం) బందనపూడిలో ఎంపీ బోస్‌తో మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలంటూ ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు

కాజులూరు: రాష్ట్రంలో పేదల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిరంతర కృషి చేస్తోందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. గురువారం మండలంలోని బందనపూడి, ఆర్యావటం తదితర గ్రామాల్లో ఆయన నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. పేద మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరించి, ప్రభుత్వ పథకాలు వారికి సక్రమంగా అందుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. ఈ సందర్భంగా బందనపూడిలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నీ నూరుశాతం అమలు చేయడంతో పాటు, ప్రజా అవసరాలకు అనుగుణంగా ఎన్నికల్లో ప్రకటించని పథకాలూ అమలు చేస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా ఇంత భారీఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలందరికీ జగనన్న సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని, రానున్న ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలని కోరారు. పార్టీ విజయాలకు కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, ఎంపీటీసీ సలాది లక్ష్మణరావు, సర్పంచ్‌లు దేగల తిరుమలవేణి, సూర్యవతి, పీఏసీఎస్ చైర్మన్ కురుపూడి సూర్యనారాయణ, జక్కన రాజేష్, పాలిక వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



ఏడిదలో లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్రంలో సంక్షేమ పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట మండలం ఏడిదలో గురువారం వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు నాలుగో విడత రుణమాఫీ సొమ్ము పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ మండపేట నియోజకవర్గంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన వేగుళ్ల జోగేశ్వరరావు ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రజల బలాన్ని నమ్ముకుంటుండగా ఎమ్మెల్యే వేగుళ్ల డబ్బును నమ్ముకుని ముందుకొస్తున్నారన్నారు. డబ్బు రాజకీయాలకు కాలం చెల్లిందని ఓటమికి సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమం అందించిన సీఎం వైఎస్ జగన్‌పాలన, ప్రజల ఆదరణ ముందు ఎమ్మెల్యే వేగుళ్ల నిలబడలేరన్నారు. ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటికి వెళ్లి వివరిస్తున్నామని ఎమ్మెల్సీ అన్నారు. తమ అభివృద్ధి ప్రజకు అర్థమవుతోందన్నారు. ఆసరా పథకం నాలుగో విడత లబ్ధివివరాలను ఈఓపీఆర్డీ ఐదం రాజు వివరించారు. అలాగే ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ కురుపూడి భవాని వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు కూడా మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బూరిగ ఆశీర్వాదం, వరదా చక్రవర్తి, పీఏసీఎస్ చైర్మన్ రామిశెట్టి శ్రీహరి, ఎంపీటీసీలు తాతపూడి ఉషా రాజేష్, పట్నాల నాగబాబు, చొల్లంగి రామారావు, అడ్డాల శ్రీదేవి, పార్టీ గ్రామ అధ్యక్షులు పలివెల సుధాకర్, నాయకులు చుండ్రు శ్రీనివాస్, బొంత లక్ష్మి, కడియం సురేఖ, కప్పల కుమారి, చింతాకుల ఉమ, కొండేటి శ్రీకాళీ కృష్ణ కుమారి, బండారు కృష్ణ, చిలుకూరి బుజ్జి, ముగళ్ళ పార్థ కృష్ణ, రామిశెట్టి ముసలయ్య, బూరిగ జానీ, ఉడతా ప్రభాకరరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రభుత్వ సంక్షేమ పాలన

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్



చప్పిడివారి సావరంలో గడప గడపకూ మన ప్రభుత్వంలో సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా సామాన్యులకు చేర్చి, దేశంలో మరే రాష్ట్రంలో ఊహించని విధంగా సామాజిక మహా విప్లవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని 15వ వార్డు చప్పిడివారి సావరంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. ప్రజలు విన్నవించిన సమస్యలను అధికారులకు చెప్పి, పరిష్కరించాలన్నారు. ఐదేళ్లుగా ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అందిస్తున్న లబ్ధిని ప్రజలకు వివరించారు. అమ్మ ఒడి, విద్యాదీవెన ఆసరా, చేయూత, వసతి దీవెన, పెన్షన్లు, గృహ నిర్మాణాలు, రైతు భరోసా, గోరుముద్ద వంటి సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమ అవుతాయని వివరించారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, కమిషనర్ బి.శ్రీనివాసులు, వార్డు కౌన్సిలర్ పోతంశెట్టి శ్యామల గోపాలకృష్ణ, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ తొగరు మూర్తి, ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ మల్లిడి సాయిలక్ష్మి, కౌన్సిలర్లు కేతా సుజాత, బాసిన నాగమణి, బావాల మంగామణి భద్రరావు, ఎం సీతారామలక్ష్మి, పాలపర్తి శ్వేతపావనిమధు, పార్టీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, పార్టీ నాయకులు ఉండి సత్తిబాబు, కార్నాల నాగేశ్వరరావు, కవల సత్తిబాబు, పోతంశెట్టి సుబ్బారావు, కొవ్వుల రామకృష్ణ, సూరంపూడి రమేష్ వలంటీర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్





కపిలేశ్వరపురం సమావేశానికి హాజరైన ఆసరా లబ్ధిదారులు, అంగరలో లబ్ధిదారులకు నమూనా చెక్ అందజేస్తున్న పృథ్వీరాజ్ తదితరులు

ఆసరా' పంపిణీ కార్యక్రమాల్లో వక్తల ఉద్ఘాటన

కపిలేశ్వరపురం: ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను సీఎం అయ్యాక పూర్తి స్థాయిలో నిలబెట్టుకున్న జనాదరణ గల నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు నాలుగో విడత రుణమాఫీ సొమ్ము పంపిణీ కార్యక్రమంలో పాల్గొనన వక్తలన్నారు. మండలంలోని కపిలేశ్వరపురం, వెదురుమూడి, అంగర, పడమర ఖండ్రిక, తాతపూడి గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు నాలుగో విడత రుణమాఫీ సొమ్ము పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, చోడే రామలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పృథ్వీరాజ్, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి మాట్లాడుతూ మహిళాభ్యున్నతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వల్లనే సాధ్యపడుతుందన్నారు. రుణమాఫీ చేస్తానన్న హామీని నాలుగు విడతల్లో నెరవేర్చారన్నారు. కరోనాలాంటి విపత్కర ఆర్థిక పరిస్థితులను సైతం అధిగమించి పేద మహిళలకు లబ్ధి చేకూర్చారన్నారు. సీఎం జగన్‌పై నిందలు మోపుతున్న వారికి ప్రజలే ఎన్నికల్లో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ గంగుమళ్ళ రాంబాబు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు అరదాని శ్రీదేవి, పసలపూడి శ్రీనివాస్, నాయకులు కట్టా మురళి, చోడే సూరిబాబు, తిరునాతి వెంకటేశ్వరరావు, చోడే వెంకటేశ్వరరావు, నక్కా సింహాచలం, కవల శ్రీనివాస్, సంకాబత్తు స్వామికాపు, యర్రా వీరన్నబాబు, పాలింగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ఓ వరం



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేంద్రబాబు

రామచంద్రపురం రూరల్: ఓటు హక్కు వినియోగంపై వెంకటాయపాలెంలో గురువారం ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్రబాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి అధ్యక్షత వహించారు. ఎస్సై మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యం కల్పించిన గొప్ప వరమని అన్నారు. ఓటు హక్కును ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు వినియోగించుకునే క్రమంలో ప్రలోభాలకు లొంగకూడదని వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ రామకృష్ణ, మహిళా పోలీస్ తులసి, కానిస్టేబుళ్లు సత్తిబాబు, సుధాకర్, వార్డు సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నూతన వసంత మంటపం ప్రారంభం



మంటపం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు, ప్రజాప్రతినిధులు

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో గురువారం నూతనంగా రూ.18 లక్షలతో నిర్మించిన వసంత మంటపాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజ బహద్దూర్ కలిసి ప్రారంభించారు. ఏటా ఉత్సవాల్లో పౌర్ణమి రోజున స్వామి సముద్రంలో స్నానమాచరించిన అనంతరం వసంత మంటపంలో సేద తీరడం ఆనవాయితీగా వస్తోంది. వసంత మంటపం పూర్తి శిథిల స్థితికి చేరడంతో, నూతన వసంత మంటపం నిర్మాణానికి దేవస్థానం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు పూర్తి రాయితో మంటప నిర్మాణం పూర్తి చేశారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

రామచంద్రపురం రూరల్: అన్నాయిపేటలోని విజయదుర్గా పరమేశ్వరి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో 33వ వార్షికోత్సవం గురువారం శ్రీదేవి బాలభక్త సమాజం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. కాకిలేటి ముత్యాలరావు, భాగ్యలక్ష్మి దంపతుల నేతృత్వంలో కలశ స్థాపన పూజ, అఖండ ఏకాహం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీఎత్తున అన్న ప్రసాద వితరణ చేశారు. అనంతరం అక్కిరెడ్డి లక్ష్మణరావు, కటారపు సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం, పలివెల నాగరాజు బృందం అయ్యప్ప భజన బృందం, తాటిపాక విజయదుర్గా మహిళా సమాజం, కై రం వీరవెంకట సత్యనారాయణ తదితర బృందాల భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటన

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని 16, 17, 18 వార్డుల్లో గురువారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ' పేరుతో పర్యటించారు. రానున్న ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, నాయకులు ఉన్నారు.

బీజేపీ పోరు యాత్రకు స్పందన

రాయవరం: బీజేపీ పోరు యాత్రలో వీధి సభలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నరాల రాంబాబు అన్నారు. రాయవరం మండలంలోని గురువారం బీజేపీ నాయకత్వంలో ప్రజా పోరుయాత్ర–2 నిర్వహించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని కూర్మాపురం, కురకాళ్లపల్లి, వెంటూరు, చెల్లూరు గ్రామాలలో ప్రజాపోరు యాత్ర వీధి సభలు నిర్వహించారు. ఈ నెల 21 నుంచి 29 వరకు ప్రజా పోరు యాత్ర–2 నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ కన్వీనర్ ఎంవీవీ సాయిరాం గురువారం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నరాల రాంబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ చిరట్ల సుబ్బారావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ఎంవివి సాయిరాం, కో కన్వీనర్ కంకటాల మురళీకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి రాయుడు శ్రీనివాస్, మండల అధ్యక్షులు శాఖ దుర్గా శ్రీనివాస్, కూర్మాపురం గ్రామ అధ్యక్షులు టీవీవీ సత్యనారాయణమూర్తి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదే జోరు, అదే సందడి



భక్తుల రక్షణకు ఏర్పాటు చేసిన బారికేడ్లు

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణ మహోత్సవాల్లో గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. మాఘమాసంలో సముద్ర స్నానాలకు ప్రాధాన్యం ఉండడంతో భక్తులతో అంతర్వేది బీచ్ సందడిగా మారింది. సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు.

బీచ్‌లో రక్షణ ఏర్పాట్లు

ఈ నెల 24వ తేదీ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారితో పాటు సముద్ర స్నానం చేయడానికి తరలివచ్చే అసంఖ్యాక భక్తుల రక్షణకు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. బీచ్‌లో మహిళలకు దుస్తులు మార్చుకునే తాత్కాలిక గదులను సిద్ధం చేస్తున్నారు. బీచ్ వద్ద సముద్రంలో లోతు ప్రదేశాల్లో వెళ్లకుండా భక్తుల రక్షణకు సర్వేబాదులతో బారికేడ్లు ఇప్పటికే ఏర్పాటు చేశారు. వీటితో పాటు, పోలీసుల పహరాకు వాచ్ టవర్లు, ముందస్తు హెచ్చరికలు జారీ చేసే మైక్‌సెట్లను బీచ్ ఒడ్డున ఏర్పాటు చేస్తున్నారు.